క్లుప్తంగా

వైభవుడికి నేడు సుప్రభాత సేవ, విశేష హారతులు



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపిస్తారన్నారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారన్నారు. 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్టి, 10గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30గంటలకు రాజభోగనివేదన ఉంటుందన్నారు. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సాయంత్రం 6.30గంటలకు విశేష హారతి సమర్పణలో భాగంగా నక్షత్ర హారతి, కర్పూర హారతి, కూష్మాండ హారతి, కుంభ హారతి ఇస్తారని వివరించారు.

మత్తుతో జీవితాలు చిత్తు



కాన్వెంట్ కూడలిలో ర్యాలీ నిర్వహిస్తున్న కళాశాల సిబ్బంది, విద్యార్థులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా డిగ్రీ కళాశాల, ఈగల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో కాన్వెంటు కూడలిలో మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పలితాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ మాట్లాడుతూ మత్తుతో యువత జీవితాలు చిత్తు చేసుకుంటున్నారన్నారు. జ్ఞానాపురం కళాశాల నుంచి కాన్వెంట్ కూడలిలో గల అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మత్తు పదార్థాలకు నో చెప్పండి -మంచి జీవితాన్ని ఎంచుకోండి' అనే నినాదాలతో మానవహారం నిర్వహించారు. మత్తు పదార్థాల వ్యతిరేక దినం సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ హేమ, జంతుశాస్త్ర విభాగాధిపతి, ఈగల్ క్లబ్ ఇన్‌చార్జి డాక్టర్ ఈ.హరిణి, డాక్టర్ సుధా ప్రియా, ఎల్. ప్రవీణ్‌కుమార్, కె.మాణిక్య కుమారి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

20 కోచ్‌లతో సికింద్రాబాద్-విశాఖ వందేభారత్ ఎక్స్‌ప్రెస్

తాటిచెట్లపాలెం: సికింద్రాబాద్-విశాఖపట్నం-సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్(20707/20708) శనివారం నుంచి 20 కోచ్‌లతో నడుస్తుందని వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఈ ఎక్స్‌ప్రెస్ 14 ఏసీ చైర్‌కార్, 2 ఎగ్జిక్యూటివ్ క్లాస్ కోచ్‌లతో నడుస్తోంది. ఇక నుంచి 18 ఏసీ చైర్‌కార్, 2 ఎగ్జిక్యూటివ్ క్లాస్ కోచ్‌లతో నడుస్తుందని అధికారులు వెల్లడించారు.

రేపు విశ్వ బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

దాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ ఎంప్లాయీస్ గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల 6న విశాఖలో తెలుగు విశ్వబ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నట్టు కమిటీ ప్రతినిధి ప్రకాశరావు, ఏల్చూరి రామారావు, ఎల్‌వీ రమణమూర్తి, ఎస్ఎస్ కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మురళీనగర్ బీవీఆర్ గ్రాండ్‌లో నిర్వహించనున్న పరిచయ వేదికకు ఆంధ్ర, తెలంగాణ తెలుగు విశ్వబ్రాహ్మణులే కాక పరిసర రాష్ట్రాల్లో ఉన్న తెలుగు విశ్వబ్రాహ్మణులు హాజరు కావచ్చని చెప్పారు. ఈ అవకాశాన్ని విశ్వబ్రాహ్మణులు వినియోగించుకోవాలని నిర్వాహకులు తెలిపారు. 8500669765, 9440634249 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆరిలోవలో కొండచిలువ కలకలం



ఆరిలోవ కాలనీలో పట్టుకున్న కొండచిలువ

ఆరిలోవ: ఆరిలోవ కాలనీలో శుక్రవారం సాయంత్రం కొండచిలువ కలకలం రేపింది. జీవీఎంసీ 13వ వార్డు ఆరిలోవ ఆఖరి బస్టాప్ దరి కంబాలకొండను ఆనుకొని ఉన్న ఆపరేషన్ కాలనీలో సాయంత్రం 6.30 గంటల సమయంలో సుమారు 11 అడుగుల కొండచిలువ నివాసాల మధ్య వీధిలోకి ప్రవేశించింది. దాన్ని చూసిన స్థానికులు పరుగులు తీశారు. దీంతో స్థానిక యువకులు కొందరు అటవీ శాఖ అధికారులకు సమాచారమివ్వడంతో సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకున్నారు. కొండచిలువను పట్టుకుని జూ పార్కుకు తరలించారు. జూ వెటర్నరీ వైద్యులు దాన్ని పరిశీలించి ఆరోగ్యంగా ఉన్నట్లు తెలపడంతో అక్కడి నుంచి తీసుకువెళ్లి కంబాలకొండల్లో విడిచిపెట్టారు.

నిర్మాణాలు పూర్తి.. ప్రారంభాలు నాస్తి



రజకుల కోసం గ్రౌండ్ ఫ్లోర్‌లో నిర్మించిన దోబీఘాట్లు, కుండీలు, బల్లలు

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మొదలై ప్రస్తుతం పూర్తయిన పలు అభివృద్ధి పనులు
- అయినా ప్రారంభానికి మాత్రం నోచుకోని వైనం
- నేతల నిర్లక్ష్యంతో ప్రజల అందుబాటులోకి రాని కల్యాణ మండపం, సామాజిక భవనం, దోబీఘాట్లు

సీతంపేట: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో ప్రతి వార్డులో అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున జరిగాయి. అప్పుడు ప్రారంభమైన ఆ పనులు ఎన్నికల కారణంగా నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కొన్ని పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రారంభానికి మాత్రం నోచుకోలేదు. చెప్పుకోదగ్గ అభివృద్ధి పనులు ప్రారంభించలేదు. కనీసం గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన వాటినైనా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రాలేదు. జీవీఎంసీ 25వ వార్డులో సుమారు రూ. కోటిన్నర వ్యయంతో బీటీ ఆర్ నగర్ రెల్లి వీధిలో మూడంతస్తుల్లో విశాలమైన కల్యాణ మండపం నిర్మించారు. పనులు పూర్తయి దాదాపు నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటికీ అది ప్రారంభానికి నోచుకోలేదు. ఒక పక్క పెళ్లి ముహూర్తాలు వెళ్లిపోతున్నా కల్యాణ మండపం మాత్రం ప్రారంభించలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రెల్లి వీధిలో ఉన్న సామాజిక భవనం సచివాలయానికి కేటాయించడంతో స్థానికులు శుభ కార్యాలకు, సమావేశాలకు సరైన భవనం లేక ఇబ్బందులు పడ్డారు. సమస్యను వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కె.కె.రాజు దృష్టికి తీసుకెళ్లడంతో కల్యాణ మండపానికి నిధులు మంజూరు చేయించారు. త్వరితగతిన కల్యాణ మండపం పూర్తయ్యేలా చర్యలు చేపట్టారు. ఫలితంగా రెల్లివీధి ప్రజల అవసరాలకు తగినట్టు విశాలమైన మూడంతస్తుల కల్యాణ మండపం సిద్ధమైంది. కానీ ఇప్పటి వరకు ప్రజలకు అందుబాటులోకి రాలేదు. శ్రావణ మాసం సమీపిస్తోంది పెళ్లి ముహూర్తాలు, శుభకార్యాలు ఉండటంతో కల్యాణ మండపం ఎప్పుడు ప్రారంభిస్తారా అని స్థానికులు ఎదురు చూస్తున్నారు.



జగన్నాథపురంలో రెండంతస్తుల్లో నిర్మించిన దోబీఘాట్, సామాజిక భవనం



సీతంపేట రెల్లివీధిలో కొత్తగా నిర్మించిన కల్యాణ మండపం

➡ జీవీఎంసీ 27వ వార్డు హిందూ ముస్లిం కాలనీలో శిథిలమైన సామాజిక భవనాన్ని తొలగించి, దాని స్థానంలో రెండంతస్తుల సామాజిక భవనం నిర్మించారు. కాలనీలో నివసిస్తున్న హిందూ ముస్లింల అవసరాల మేరకు సౌకర్యంగా ఉండేలా సామాజిక భవన నిర్మాణం జరిగింది. అయితే ఆ భవనం నిర్మించి నాలుగు నెలలు గడిచినా ఇంకా ప్రజలకు అందుబాటులోకి రాలేదు

➡ 43వ వార్డు జగన్నాథపురంలోని దోబీ ఖానా శిథిలం కావడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.40.70 లక్షలు మంజూరు చేశారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో రజకులు బట్టలు ఉతికేందుకు సౌకర్యంగా దోబీఘాట్లు, సిమెంట్ బల్లలు, నీళ్ల కుండీలు, మోటార్ కనెక్షన్, నీటి సరఫరా ఏర్పాటు చేశారు. అలాగే మొదటి అంతస్తులో సామాజిక భవనం నిర్మించారు. రజకుల శుభకార్యాలు, సమావేశాలకు వినియోగించేలా రెండంతస్తుల్లో భవన నిర్మాణం పూర్తయి ఆరు నెలలు గడిచిపోయింది. ప్రారంభానికి మాత్రం నోచుకోలేదు.

➡ 43వ వార్డు 80 అడుగుల రోడ్డు నుంచి శ్రీనివాసనగర్ బెల్లం రాములమ్మ వీధికి వెళ్లే మార్గంలో గెడ్డ కల్వర్టు కింద ఉన్న గోడలు శిథిలమై బ్రిడ్జి బలహీనమై ప్రమాదకరంగా మారింది. దీంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కొత్తగా బాక్సు కల్వర్టు నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం రూ. 20 లక్షలు మంజూరు చేసింది. ఎన్నికల కోడ్ అనంతరం పనులు ప్రారంభమయ్యాయి. గతంలో కంటే విశాలంగా వాహనాలు రాకపోకలు సాగించేలా బాక్సు కల్వర్టు నిర్మించారు. అప్రోచ్ రోడ్డు కూడా వేశారు. అలాగే కర్రివాని గెడ్డపై సుమారు రూ. 50 లక్షల వ్యయంతో బాక్సు కల్వర్టు నిర్మించారు. ప్రజలు రాకపోకలు సాగిస్తున్నా ప్రారంభానికి ఇటు అధికారులు అటు ప్రజా ప్రతినిధులకు తీరిక లేదని జనం అసహనం వ్యక్తం చేస్తున్నారు.



హిందూ ముస్లిం కాలనీలో నిర్మించిన సామాజిక భవనం

వైఎస్సార్‌సీపీలో నియామకాలు

సీతంపేట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మొహమ్మద్ పీర్ (బిలాల్)ను విశాఖ ఉత్తర నియోజకవర్గం మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా నియమించారు. నార్త్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన నీలి రవిని విశాఖపట్నం జిల్లా బూత్ కమిటీల విభాగం అధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

కంచరపాలెం సీఐగా రవికుమార్



మర్రిపాలెం: కంచరపాలెం శాంతి భద్రతల విభాగం సీఐగా కవిటి రవికుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కు చెందిన రవికుమార్ ఎస్ఐగా పలు ప్రాంతాల్లో విధులు నిర్వహించి 2021లో సీఐగా పదోన్నతి పొందారు. ఆయన సిటీ స్పెషల్ బ్రాంచ్, రాజాం టౌన్, పార్వతీపురంలలో సీఐగా విధులు నిర్వర్తించిన ఆయన ఇటీవల ఫిఫ్త్‌టౌన్ పీఎస్‌లో ఇన్‌చార్జి సీఐగా విధులు నిర్వహించారు. సీపీ ఆదేశాల మేరకు ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సీఐగా ఉన్న చంద్రశేఖర్ సీసీఎస్‌కు బదిలీ పై వెళ్లారు.

విశాఖ విమల విద్యాలయాన్ని తక్షణం తెరవాలి

దాబాగార్డెన్స్: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు చెందిన విశాఖ విమల విద్యాలయాన్ని నేటికీ ప్రారంభించకుండా కూటమి ప్రభుత్వం తీవ్ర ఆటంకాలు సృష్టిస్తుందని, స్కూల్ మూసివేతకు కుట్ర పన్నుతోందని, ఈ చర్యను సీపీఎం విశాఖ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు ఆరోపించారు. విశాఖ ఎంపీ, గాజువాక ఎమ్మెల్యే విమల విద్యాలయాన్ని మూసివేస్తున్నారు కనుక టీచర్లకు వీఆర్ఎస్ ఇచ్చి పంపించాలని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యానికి ఇచ్చిన లెటర్లు వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ మేరకు శుక్రవారం జగదాంబ జంక్షన్ సీపీఎం కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.జగన్‌తో కలిసి మీడియా సమావేశంలో గంగారావు మాట్లాడారు. వీరి చర్యల వల్ల 1600 మంది విద్యార్థులు నడిరోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని, తక్షణమే స్కూల్‌ని ప్రారంభించేలా విశాఖ ఎంపీ, స్థానిక ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని సీపీఎం కోరుతుందన్నారు.

ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్స్

203 మంది విద్యార్థులకు రూ.15 లక్షలు అందించిన జేబీ ఫౌండేషన్



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినికి స్కాలర్‌షిప్ అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

తాటిచెట్లపాలెం: ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు జేబీ ఫౌండేషన్ స్కాలర్‌షిప్స్ అందజేసింది. సీతమ్మధారలోని ఆక్సిజన్ టవర్స్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ చేతులమీదుగా ఈ స్కాలర్‌షిప్స్ అందజేశారు. నగరంలోని బీవీకే, ఏవీఎన్, ప్రభుత్వ మహిళల కళాశాల, కృష్ణా కళాశాలల నుంచి ఉత్తమ ఫలితాలు సాధించిన సుమారు 203మంది విద్యార్థులకు ఈ ఫౌండేషన్ ద్వారా 15 లక్షల రూపాయలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కెనడాలో నివసిస్తున్నా, స్వదేశానికి సహకారం అందించాలని ఫౌండేషన్ ఏర్పాటుతో ముందుకు వచ్చిన సాయి, శైలజ, రోహన్, డేవిడ్‌లను అభినందించారు. వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీవీకే ప్రిన్సిపాల్ రత్నశేఖర్, ఏవీఎన్ కాలేజి ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు, గవర్నమెంట్ ఉమెన్స్ కాలేజి ప్రిన్సిపాల్ మంజుల, కృష్ణాకాలేజి వైస్ ప్రిన్సిపల్ జయ, రజని, చీకటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వారాహి నవరాత్రులు



చతుర్వేద స్వస్తి చదువుతున్న అర్చకులు



పూజల్లో పాల్గొన్న భక్తజనం

సీతంపేట: అక్కయ్యపాలెంలోని శ్రీలలితా పీఠంలో గత నెల 26వ తేదీ నుంచి జరుగుతున్న వారాహి నవరాత్రి మహోత్సవాలు శుక్రవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా అమ్మవారికి క్షీరాభిషేకం, సహస్ర నామార్చన, ప్రత్యేక అలంకరణ, చతుర్వేద స్వస్తి, విశేష హారతులు జరిపారు. వారాహి నవరాత్రులు ఆచరించిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘాటెక్కిన పచ్చిమిర్చి

సీతంపేట: పచ్చి మిర్చి ధర కొండెక్కి కూర్చుంది. రైతుబజార్లలో నిన్న మొన్నటి వరకు కిలో రూ. 30 నుంచి రూ. 40 మధ్య ఉండే మిర్చి అమాంతంగా రూ. 64కు ఎగబాకింది. ఇక బహిరంగ మార్కెట్‌లో పావు కిలో రూ. 30 చొప్పున, కిలో రూ. 120 వరకు ధర పలుకుతోంది. మిర్చి కొనకుండానే కంట నీరు తెప్పిస్తోందని మహిళలు అంటున్నారు. ఇటీవల కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలతో నగరానికి మిర్చి దిగుమతులు తగ్గాయి. డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడంతో హోల్ సేల్ మార్కెట్‌లో ధరలు పెరిగాయి. దీంతో రైతు బజార్‌లో గురువారం కిలో రూ. 60కు విక్రయించగా, శుక్రవారం మరో నాలుగు రూపాయలు పెరగడంతో కిలో రూ. 64 చొప్పున విక్రయించారు. నరసింహనగర్ రైతుబజార్‌లో సాధారణంగా రోజు వారి విక్రయాలకు 5 నుంచి 6 క్వింటాళ్లు అవసరం కాగా మూడు క్వింటాళ్లు మాత్రమే వచ్చినట్టు ఈవో కొండబాబు తెలిపారు. స్థానికంగా పచ్చి మిర్చి పంట అంతగా లేకపోవడం, రాయపూర్ నుంచి పచ్చిమిర్చి దిగుమతి తగ్గడంతో ధరలు పెరిగాయని, మరి కొద్ది రోజుల్లో ధరలు తగ్గుముఖం పడతాయని తెలిపారు.



నరసింహనగర్ రైతుబజార్‌లో పచ్చిమిర్చి విక్రయాలు

ట్రాఫిక్ నియంత్రణకు ఏఐ సేవలు

దాబాగార్డెన్స్: నగర పరిధిలో ట్రాఫిక్ నియంత్రణకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిర్వహణ అవసరమని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. శుక్రవారం తన చాంబర్‌లో ట్రాఫిక్ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రామరాజు, ట్రాఫిక్ పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత రోడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అమలుకు దేశంలోని ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలను ఆహ్వానించామన్నారు. నొయిడా నుంచి మెటాఫ్యుజిన్, నెక్, బెంగళూరు నుంచి డాటా క్రాఫ్, ముంబై నుంచి సీఎంఎస్ కంప్యూటర్స్, హైదరాబాద్ నుంచి బృహస్పతి టెక్నాలజీస్ వంటి కంపెనీలు ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఈ కంపెనీలు శుక్రవారం విశాఖ కలెక్టరేట్‌లో ఎంపీ శ్రీభరత్, కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ వద్ద ప్రజంటేషన్స్ ఇచ్చాయన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ట్రాఫిక్ వ్యవస్థ ద్వారా పరిమితికి మించి వేగంగా వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, రెడ్ సిగ్నల్స్‌ను ధిక్కరించి ప్రయాణం చేయడం, రాంగ్ పార్కింగ్ వంటివి కనిపెట్టి ఆటోమేటిక్‌గా ట్రాఫిక్ చలానా జారీ జరుగుతుందన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకం

- స్మరించుకున్న వక్తలు
- జయంతి వేళ మన్యం వీరుడికి ఘన నివాళులు



సీతమ్మధార జంక్షన్‌లో అల్లూరి జయంతి వేడుకల్లో పాల్గొన్న క్షత్రియ సేవా సమితి సభ్యులు



క్షత్రియ యూత్ వింగ్ ఆధ్వర్యంలో జరిగిన మెగారక్తదాన శిబిరంలో పాల్గొన్న కేకే రాజు తదితరులు



ఈపీడీసీఎల్ కార్యాలయంలో అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు



51వ వార్డులో అల్లూరి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న రెయ్యి వెంకటరమణ

తాటిచెట్లపాలెం: బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాటం స్ఫూర్తిదాయకమని వక్తలు కొనియాడారు. విప్లవజ్యోతి అల్లూరి 128వ జయంతి సందర్భంగా శుక్రవారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

➡ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు ఆధ్వర్యంలో సీతమ్మధారలోని అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరి పోరాటపటిమ, త్యాగాలను ఈ సందర్భంగా నాయకులు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, పర్యవేక్షకులు రవి రెడ్డి, రాష్ట్ర అనుబంధ కమిటీ అధ్యక్షుడు జాన్‌వెస్లీ, పేర్ల విజయచందర్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాస్, పార్టీ ముఖ్య నాయకులు నడింపల్లి కృష్ణ రాజు, ద్రోణంరాజు శ్రీ వత్సవ, సతీష్ వర్మ, ఫరూఖీ, అల్లంపల్లి రాజబాబు, కార్పొరేటర్లు అనిల్ కుమార్‌రాజు, బిపిన్ కుమార్ జైన్, మువ్వల లక్ష్మీ సురేష్, ఎండీ షరీఫ్, అనుబంధ విభాగం అధ్యక్షులు అంబటి శైలేష్, పేడాడ రమణికుమారి, బోని శివరామకృష్ణ, పులగం కొండారెడ్డి, బోండా ఉమా మహేష్, పీలా ప్రేమ, జిల్లా అధికార ప్రతినిధి పల్ల దుర్గా మల్లేశ్వరి, పార్టీ నాయకులు శ్రీదేవివర్మ, సత్యాల సాగరిక, రామకృష్ణారెడ్డి, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో..

క్షత్రియసేవా సమితి ఆధ్వర్యంలో సీతమ్మధార జంక్షన్‌లోని అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అల్లూరి పోరాటాన్ని స్మరించుకున్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, క్షత్రియ సంక్షేమ సమితి చైర్మన్, సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జీఎస్ఎన్ రాజు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్ రాజు, మాజీ కార్పొరేటర్ జీవీ రవిరాజు, క్షత్రియ సేవాసమితి సెక్రటరీ ఆర్‌వీ గణపతిరాజు, వైస్ ప్రెసిడెంట్ ఎస్ఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన, వైద్య శిబిరాలు

విశాఖపట్నం క్షత్రియ యూత్ వింగ్ ఆధ్వర్యంలో క్షత్రియ కల్యాణమండపంలో అల్లూరి జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు పాల్గొని, అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఏటా మాదిరిగానే ఈ సంవత్సరమూ మెగా రక్తదాన, వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో సుమారు 150మంది రక్తదానం చేశారు. వైద్య శిబిరంలో విజన్ ట్రీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ మధు, డాక్టర్ శాంతి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమాలను యూత్ వింగ్ ప్రెసిడెంట్ జి. పృథ్వి రాజ్, సెక్రటరీ జి.శ్రవణ్‌కుమార్, ట్రెజరర్ వి.అవినైకుమార్ రాజు తదితరులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంఆర్‌కే రాజు, శ్రీనివాసరాజు, మురళీమహేష్ రాజు, కృష్ణంరాజు, మనోహర్‌రాజు, యూత్ సభ్యులు, క్షత్రియ పెద్దలు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంలో...

సీతమ్మధారలోని బీజేపీ ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో అల్లూరి చిత్రపటం వద్ద పార్టీ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ యువనాయకులు సునీల్ అగర్వాల్, శ్యామలదీపిక, రాంబాబు, అరుణ్‌బాబు, ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్‌లో..

తాటిచెట్లపాలెం: సీతమ్మధారలోని ఈపీడీసీఎల్ కార్యాలయంలో అల్లూరి జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు డి.చంద్రం, సూర్యప్రకాష్, టి.వనజ, సీజీఎంలు విజయలలిత, సుమన్ కళ్యాణి, రామచంద్రప్రసాద్, అచ్చి రవికుమార్, హరిబాబు, అశోక్ కుమార్, మహేంద్రనాథ్, సులేఖరాణి, జనరల్ మేనేజర్లు, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

49వ వార్డులో..

మురళీనగర్: మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో అగ్గిపిడుగు అల్లూరి జయంతి వేడుకలు నిర్వహించారు. 49వ వార్డు గ్రామ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అల్లూరి విగ్రహానికి కమిటీ సభ్యులు నివాళులర్పించారు. ఈస్ట్ పార్క్‌లో వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ యూత్ చైర్మన్ సీహెచ్.వంశీకృష్ణ వర్మ తదితరులు పాల్గొన్నారు.

51వ వార్డులో..

మర్రిపాలెం: అల్లూరి జయంతిని 51వ వార్డులో ఘనంగా నిర్వహించారు. ఈస్ట్‌పార్కులో అల్లూరి విగ్రహానికి వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తిరుమలరావు, పొన్నాడ అప్పారావు, దమయంతి, వరలక్ష్మి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు వృద్ధురాలు



గంగమ్మను ఆమె సోదరుడికి అప్పగిస్తున్న సోషల్ వర్కర్ పింకీ జెన

అల్లిపురం: చిన్నతనం నుండి మానసిక వ్యాధితో బాధపడుతూ రోడ్లపై తిరుగుతుండే గంగమ్మ (60)కు ఏయూటీడీ సిబ్బంది ఈ ఏడాది జనవరిలో ఆశ్రయం కల్పించారు. శ్రద్ధా సంస్థ చికిత్స అందించడంతో ఆమె కోలుకుంది. దీంతో ఆమె తనకు చిన్నప్పటి నుంచి ఈ జబ్బు ఉందని, పెళ్లి కాలేదని తెలిపింది. తల్లిదండ్రులు తన 30వ ఏట చనిపోవడంతో జబ్బు మరింత ముదిరి కర్ణాటక రాష్ట్రం, బళ్ళారి దగ్గర దసరా నగినహళ్లి గ్రామం వదిలి వైజాగ్ వచ్చేసాని తెలపటంతో గంగమ్మను సోషల్ వర్కర్ పింకీ జెన వైజాగ్ నుంచి తీసుకెళ్లి ఆమె సోదరుడు గంగాధర్, కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.